

# సంసారంలో సరిగమలు - తమస్విని



*(ప్రతి సంసారంలోనూ వినిపించే రాగాలు..*

*కొన్ని సరదాలు, కొన్ని సరాగాలు,*

*కొన్ని సరసాలు, ఇంకొన్ని విరసాలు, మరికొన్ని విషాద గీతాలు..*

*వెరసి సంసారంలో సరిగమలు..!)*

## సత్కాలక్షేపం

**"తెల్లారి రెండు గంటలవుతోంది.** ఇంతదాకా కాఫీ ఇవ్వలేదు" ఆయన మూలిగాడు.

"ఎండాకాలం ఐదింటికే తెల్లారుతుంది. కోడితోపాటు లేవడానికి అంత తొందరెందుకు? ఏ రాజ్యాలు ఏలాలో?" ఆవిడ వెటకారంగా అడిగి పక్కకి వత్తిగిల్లింది.

"ఏలాల్సిన కాలంలో ఏలాం కాబట్టే అంత నిశ్చింతగా పడుకున్నావు" ఆయన గర్వంగా చెప్పాడు.

"మరే!"

"లేచావుగా. కాఫీ ఇవ్వరాదు. మళ్ళీ పడుకుంటావే?"

"రాత్రంతా నిద్రలేదు. కాళ్ళు ఒకటే నొప్పులు."

"ఏం కాళ్ళు నొచ్చే బాలామణికి? రాత్రి ఎవని స్వప్నసీమ కేగివచ్చే?"

"ఈ వయసులో అదొక్కటే తక్కువ."

"అంటే వయసులో ఉన్నప్పుడు వెళ్ళేదానివన్నమాట!"

"అందులో నా ప్రమేయం ఏముందిట? మన పెళ్ళిచూపులయ్యాక మీ కలల్లోకి కూడా వచ్చానని చెప్పారుగా?"

"అదే మరి! ఆ విధంగా తిరిగితే మోకాళ్ళు అరిగిపోవు?"

ఆయన సరసంగా చెప్పి ఆవిడ బుగ్గమీద చిటికె వేసాడు.

"అందుకేనేమో చదువుకునే రోజుల్లో నన్ను డ్రీంగర్ల్ అనేవారు" ఆవిడ చిరునవ్వుతో చెప్పింది.

ఆయన గలగల నవ్వి చెప్పాడు.

"ఇప్పుడేమో పగలు చూస్తే, రాత్రి కల్లోకి వచ్చేట్టుగా ఉన్నావు."

"అందుకేనా పాపం తమరు అర్ధరాత్రిదాకా నిద్రపోరు?"

"అంతా నీలాంటి అదృష్టవంతులుంటారా? పడుకోగానే నిద్రపోడానికి?"

"దిష్టి పెట్టకండి. నా నిద్రని చూస్తే మీకు కుళ్ళు. ఓర్వలేరు. అందుకే తెల్లారకుండానే లేపుతారు"

"తెల్లారలేదా? కాస్త కిటికీ తలుపు తెరిస్తే సూర్యభగవానుడు కనిపిస్తాడు. మల్లెపూచాయలో ఉంటాడు. మధ్యాహ్నామైందిగా."

"ఆ వెటకారాలే వద్దంటాను. ఏం మనిషో ఏమిటో కంటి నిండా నిద్రపోనీరు" ఆవిడ విసుక్కుంటూ లేచింది.

"నీ ప్రేమ మరీ తియ్యగా ఉందోయ్" కాఫీ చప్పరించి చెప్పాడు.

"నిద్ర కళ్ళతో చేస్తే అలాగే ఉంటుంది. కొంచెం డికాషన్ వెయ్యనా?"

" వద్దులే. పాలు పొయ్యి."

"పిల్లి పిల్లల్లే ఆ పాల పిచ్చేమిటో."

"నీలాంటి తామసికులకి చేదు, నాలాంటి సాత్వీకులకి మధుర పదార్ధాలు ఇష్టమట. గీతలో శ్రీకృష్ణుడు చెప్పాడు."

"మరి మధురమైన కాఫీ మాట్లాడకుండా తాగలేరు."

"అది అతిమధురం అమ్మడూ సరేకాని వంటేం చేస్తున్నావ్?"

"వెరైటీగా ఇవ్వాళేమీ చేయద్దనుకుంటున్నా."

"అలాగా? మా బావమరిదింటికి విందుకు వెళ్తున్నామా?"

"ఎప్పుడూ మా పుట్టింటి మీద ఆశే. మీ చెల్లెలింటికి వెళ్దామా అన్నమాట రాదు నోటినించి."

"మా చెల్లి వంట ఆయుర్వేద మందులా ఉంటుందనలేదూ నువ్వు?"

"అవును. సాంబారు బదులు కంచంలో మాదీఫల రసాయనం పోసింది ఆరోజు."

"నీ వంట దానికి యునానీ మందులా ఉంటుందేమో మరి. వదినా ఆడబిడ్డలు కదా."

"అననివ్వండి. నన్ను అన్నవాళ్ళు వాళ్ళ పాపాన వాళ్ళే పోతారు."

"నటన బానే ఉంది కాని, కంఠం కొద్దిగా గద్గదంగా, కళ్ళు కొంచెం చమర్చి ఉండాలి అనుకుంటా."

"పెద్ద డైరెక్టర్ వచ్చారు లెండి. నా బాధ మీకేం తెలుసు కొబ్బరికాయలాగా పైకి కఠినంగా ఉన్నా లేత కొబ్బరి కదూ నా మనసు?"

"కనపడని వాటి గురించేం మాట్లాడతావు కాని, కనిపించేదాని గురించి చెప్పు. మొగుడికి అన్నం వండి పెట్టేదేమైనా ఉందా?"

"నా గురించి ఓ మంచిమాట కూడా సహించలేరు మీకు. అసూయ"

"నీ గురించి ఇంకెవరైనా మంచి మాటలు మాట్లాడితే సరే. కానీ ఎప్పుడూ పాపం నువ్వే నిన్ను పొగుడుకుంటావ్. వినీ వినీ విసుగురాదు? దీన్నే మా శాంస్క్రీట్ మాస్టారు ఏమంటారో తెలుసా? 'స్వ..."

"చాలు. చాలు ఎంత మాటన్నారు? నన్ను నేను పొగుడుకుంటానా? అయ్యో! ఇంట్లో పెళ్ళాం ఉందే, అది గొడ్డులాగా కష్టపడుతుందే అని ఒక్క ప్రశంసైనా వచ్చిందా మీ నోటివెంట?"

"అవును. ఈ భూమి పుట్టింది మొదలు నువ్వొక్కదానివే ఇద్దరు మనుషుల కోసం గొడ్డులా కష్టపడేది."

"ఇప్పుడు ఇద్దరు మనుషులు. పెళ్ళయిన కొత్తల్లో ఆరుగురు మనుషులకి వండిపోసాను. బొత్తిగా కృతజ్ఞత లేదమ్మా ఈ మనిషికి."

"నీ ఒంటిమీద సొమ్ములు కూడా ఇదేమాట అనుకుంటున్నాయట నిన్ను చూసి. లాకర్లోవి కూడా."

"అంటే? మీకు చాకిరి చేసినందుకు నగలు కొనుక్కున్నాననా?"

"అది నీ విచక్షణకే వదిలేసా?"

"విచక్షణ అని అంత పెద్ద మాటంటారా? నా హృదయం గాయపడింది. అమ్మా నాన్న లేరు కాని ఉంటే పుట్టింటికి వెళ్ళిపోయేదాన్ని."

"అన్నదమ్ముల్ని కూడా పుట్టిల్లే అంటారనుకుంటా."

"అంటే? నేను కొంపలోంచి పోవాలని కోరికగా ఉందా మీకు? మా వదిన కూడా మీలాంటి తగని మనిషి కాబట్టికాని, లేకపోతేనా?"

"అబ్బో పౌరుషం ముంచుకొచ్చిందే?"

"అంతేలెండి. ఏమన్నా ఇది గడపదాటి వెళ్ళలేదనేగా ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారు?"

ఫోన్ మోగింది.

"పెద్దాడు. ఓ నిమిషం ఉండు.. ఏరా హరీ ఎలా ఉన్నావ్?"

"మేం బానే ఉన్నాం నాన్నా. మీరేం చేస్తున్నారు?"

"అమ్మతో కబుర్లు చెప్తున్నా."

అవతలి నించి నవ్వు వినిపించింది.

"మీ మధ్య కబుర్లు కూడా ఉంటాయా నాన్నా? వాదనలేగా?"

"అవే కదరా మాకు సత్కాలక్షేపం? మరి కాలం గడవాలిగా?"

"మాటలతో సరిపెట్టుకోండి నాన్నా"హరి నవ్వి లైన్ కట్ చేసాడు.

"ఇంతకీ ఇవాళ వంటేం చేస్తున్నావు?"

"ఆలోచిస్తున్నా. ఒకటే కాళ్ళు నొప్పులు. రాత్రి నిద్రలేదు."

"ఏం కాళ్ళు నొచ్చె బాలామణికి? రాత్రి ఎవని స్వప్నసీమ కేగి వచ్చే"

*(వచ్చే సంచికలో మరో సరిగమ)*

Click here to share your comments